క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీలను పర్యవేక్షిస్తున్న రవీంద్ర కుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం డ్రాయింగ్ టీచర్ రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్లకు నచ్చిన చిత్రం, సీనియర్లకు స్వర్ణాంధ్ర 2047 అనే అంశాలపై పోటీలు జరిగాయి. అనంతరం డ్యాన్స్ ప్రాక్టీస్, లలిత సంగీతం భగవద్గీత తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు), ఆదిరెడ్డి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, బొడ్డు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్‌ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ ఆల్ బ్యాంకు కాలనీ, మోడల్ కాలనీ, వీఎల్ పురం , సత్యనారాయణపురం, పెద్దవీధి, శ్రీనగర్ కాలనీ, తిలక్ రోడ్డు, కోనేరుపేట, సాయి బృందావన్ కాలనీ, మోరంపూడి సెంటర్, ఎం మార్చల్ నేషనల్ హైవే, హోతా లేఅవుట్, మోరంపూడి, గణేష్ నగర్, మోరంపూడి సెంటర్ లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రకాశం నగర్, సుబ్బారావు పేట, కందుకూరి రాజ్యలక్ష్మి కాలేజీ, ఎస్‌కేవీటీ స్కూల్ ఏరియాలలో సరఫరా ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ పిడింగొయ్యి, కవలగొయ్యి, పోలీస్ క్వార్టర్స్, బాలాజీ నగర్, తారకరామనగర్, రూపానగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి పల్లకీ సేవ



స్వామివారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పల్లకీలో డప్పు వాయిద్యాలతో పురవీధులలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట నృత్యం అలరించింది. కార్యక్రమంలో భక్తులు, రైల్వే ఉద్యోగులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

కడియం: వైఎస్సార్ సీపీ కుమారుడి వైద్యం కోసం రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ గురువారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కడియం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త గుత్తుల శ్రీనివాస్ కుమారుడు బాబూజీ కిడ్నీ సమస్యతో వైద్యం పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న నాగేశ్వర్ హాస్పిటల్‌లో అతడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అతడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.

ఉత్సాహంగా వేసవి చిత్రకళా శిక్షణ శిబిరం



శిక్షణను పరిశీలిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని దామర్ల రామారావు స్మారక చిత్రకళా మందిరంలో నెల రోజులుగా వేసవి చిత్రకళా శిక్షణ శిబిరం విజయవంతంగా జరుగుతోందని మాజేటి రాజాజీ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు మాజేటి రవి ప్రకాష్ తెలిపారు. దీనిలో భాగంగా గురువారం బాల బాలికలకు ఫోక్ డ్యాన్స్, కోలాటం, భరత నాట్యం, పాటలు మొదలగు వాటిలో వినోద్ దంపతులు శిక్షణ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రజాపక్షం కన్వీనర్ దేశిరెడ్డి బలరాం నాయుడు, మద్దూరి అన్నపూర్ణయ్య సేవాసమితి వ్యవస్థాపక కార్యదర్శి బెజవాడ రంగారావు పాల్గొన్నారు.

నిరంతర నిఘా..



ప్రభుత్వాసుపత్రిలో సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ

- ప్రభుత్వాస్పత్రిలో 60 సీసీ కెమెరాలు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్
- త్వరలో మరిన్ని ఏర్పాటుకు చర్యలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మరింత కట్టుదిట్టమైన భద్రతా పర్యవేక్షణలో కొనసాగుతోంది. ఇప్పటికే ఆసుపత్రి అంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంది. గతంలో సీసీ కెమెరాల నిఘా ఉన్నా అవి అంతంత మాత్రంగా ఉండేవి. అంతేకాక వాటిని అవసరం లేని ప్రాంతాల్లో వృథాగా ఏర్పాటు చేశారు. పేరుకు మాత్రం సీసీ కెమెరాలున్నా వాటి లక్ష్యం మాత్రం సున్నాగా ఉండేది. ఈ విధంగా ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా పలుమార్లు వైద్య సామగ్రి దొంగతనాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఆసుపత్రిలో నిత్యం అధిక సంఖ్యలో వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. వారు సయయానికి విధులకు హాజరైనా తర్వాత వారు ఏం చేస్తున్నారు, రోగులతో ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు అనే విషయాలు తెలుసుకునే వీలుఉన్నా ఆ పని అంతంత మాత్రంగానే జరిగేది. దీంతో తమ ఇష్టారాజ్యంగా కొందరు సిబ్బంది ప్రవర్తించేవారు.

60 సీసీ కెమెరాలు

ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో 60 సీసీ కెమెరాలు నిత్యం పనిచేస్తున్నాయి. వీటిలో ప్రధాన ఆసుపత్రిలో 46, మాతా శిశు విభాగంలో 24 కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి మానటరింగ్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ తన గదిలోంచే పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యుల నుంచి వైద్య సిబ్బంది, నర్సుల పనితీరును నిత్యం పరిశీలిస్తున్నారు. దీంతో పనివేళల్లో ఆసుపత్రిలో అన్ని విభాగాల సిబ్బంది అప్రమత్తతతో ఉంటున్నారు. సూపరింటెండెంట్ సీసీ కెమెరాల్లో చూస్తున్నారు అనే భయంతో సిబ్బంది రోగులతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రిలో రోగులు అధికంగా వచ్చే జనరల్ వార్డు విభాగం, ఆర్థో విభాగం, ఆర్ఎంవో గది ప్రాంతం, ఆసుపత్రిలోని పైఅంతస్తుల్లోని పలు రద్దీగా ఉండే విభాగాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరికొన్నింటిని త్వరలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నిత్యం పర్యవేక్షణ

ఆసుపత్రిలో సీసీ కెమెరాలను నా గది నుంచే నేరుగా పర్యవేక్షిస్తాను. ఆసుపత్రి రద్దీగా ఉండే ఉదయం సమయంలో వీటిపై అధికంగా దృష్టి పెడతాను. ఆసుపత్రిలో రోగులు రద్దీ, ఓపీ చూస్తున్న డాక్టర్లపై పర్యవేక్షణ ఉంటుంది. ఒక్కోసారి వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించడం కూడా కనిపిస్తుంది. వెంటనే సంబంధిత వ్యక్తులను పిలిచి మెమోలు ఇచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. అలాగే ఎవరైనా రోగుల వద్ద డబ్బులు వంటివి డిమాండ్ చేస్తున్నారా అనే విషయాల్ని గమనిస్తున్నాం. ఎక్కడైనా అటువంటివి జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల పర్యవేక్షణతో వైద్య సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉంటున్నారు.

– డాక్టర్ సూర్యప్రభ, సూపరింటెండెంట్

యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం



యోగాంధ్రలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ: యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు అన్నారు. యోగాంధ్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానం సమీపంలోని గ్రాండ్ ట్రంకు రోడ్డుపై గురువారం ప్రాధాన్యత రంగం శాఖల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రైతులు, నగర ప్రజలు, మహిళలతో యోగా సాధన చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు, యోగా గురువు శివకుమార్ ఆధ్వర్యంలో సూక్ష్మ వ్యాయామం, తాడాసనం, వృక్షాసనం, పాదహస్తాసనం, అర్ధ చక్రాసనం, త్రికోణాసనం వంటి వివిధ ఆసనాలతో పాటు యోగా ప్రక్రియలను సాధన చేయించారు. అనంతరం బ్రహ్మకుమారి సోదరి బీకే శ్రావణి రాజయోగ ధ్యానం (మెడిటేషన్) చేయించారు. జూన్ ఒకటిన సరస్వతీ ఘాట్, 7న సత్యదేవ నర్సరీ, 14న కొవ్వూరు గోష్పాద క్షేత్రం, 20న నగర వనం తదితర పర్యాటక ప్రదేశాల్లో యోగా అభ్యాస సాధన జరుగుతుందన్నారు. అనంతరం వై.జంక్షన్ వరకూ ర్యాలీగా వెళ్లి, అక్కడ రైతులు, అధికారులు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి ఉత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీపద్మావతి, గోదాదేవీ సమేత వేంకటేశ్వరస్వామివారి గోవింద క్షేత్రంలో జరుగుతున్న 15వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తిరువీధి ఉత్సవం, గరుడ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీలక్ష్మీహయగ్రీవయిష్టి, సీతా రామచంద్రమూర్తికి క్షీరాదివాసం, పూర్ణాహుతి, తీర్థగోష్ఠి జరిపారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణ, అనంతరం శ్రీవారి తిరువీధి ఉత్సవం , గరుడ వాహన సేవ, సీతారామచంద్రమూర్తికి పంచశయ్యాదివాసం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.



గరుడ వాహన సేవలో పాల్గొన్న భక్తులు

లంకాలమ్మ జాతర ఉత్సవ కమిటీకి సన్మానం



సన్మానం అనంతరం కేక్ కట్ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, సర్పంచ్ రాంపండు, ఉత్సవ కమిటీ సభ్యులు

సీతానగరం: ఇనుగంటివారిపేటలో లంకాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవ కమిటీ సభ్యులను గురువారం ఘనంగా సన్మానించారు. ఆ గ్రామ సర్పంచ్ సత్యం రాంపండు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పదకొండేళ్లకు ఒకసారి వచ్చే లంకాలమ్మ అమ్మవారి జాతరను ఈ నెల 15 నుంచి 25 వరకు గ్రామస్తుల సహాయ సహకారాలతో అత్యంత వైభవంగా జరిపారు. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులైన పెందుర్తి వెంకటేశ్వర్లు (స్మాల్), ముత్యాల గంగాధర్, బండారు పరశురామన్న, బంటపల్లి వెంకటపతి (బుజ్జి)లను జక్కంపూడి విజయలక్ష్మి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మిని జాతర ఉత్సవ కమిటీ, సర్పంచ్ రాంపండు సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ సంబరాలు చేసుకున్నారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామ దేవత లంకాలమ్మ అమ్మవారి జాతరను ప్రశాంత వాతావరణంలో ఉత్సవ కమిటీ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా



డ్రోన్ కెమెరాలో నమోదైన ధవళేశ్వరంలోని ఓ ప్రాంతం

ధవళేశ్వరం: గ్రామంలోని నిర్మానుష్య ప్రాంతాల్లో గురువారం ధవళేశ్వరం పోలీసులు డ్రోన్లతో నిఘా పెట్టారు. స్థానిక రామపాదాల రేవు, జాలరుపేట, సాయిబాబా గుడి వెనుక ప్రాంతం , కంచర్ల లైన్, బోటాపీసు వీధి తదితర ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక కంచర్లలైన్ వద్ద గోదావరి గట్టున మద్యం తాగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసినట్లు ధవళేశ్వరం సీఐ టి.గణేష్ వెల్లడించారు.

పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలి

ధవళేశ్వరం: ఇరిగేషన్ శాఖలో బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ధవళేశ్వరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు పండూరి అప్పారావు, ధవళేశ్వరం క్లస్టర్ ఇన్‌చార్జి తలారి మూర్తి గురువారం ఇరిగేషన్ ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారు. కొందరు గత 20 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు: అప్పుల బాధ భరించలేక ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇవి. కాకినాడ సర్పవరానికి చెందిన గొట్టిముక్కల సూర్య వెంకట చైతన్యరాజు (44)కు అప్పులు అధికమయ్యాయి. దీంతో ఈ నెల 24న రాజమహేంద్రవరం వచ్చి సాయిప్రియ లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. అలాగే ఈ నెల 27న కుటుంబీకులకు ఫోన్ చేసి తనకు అప్పులు అధికంగా ఉన్నాయని, ఆ బాధ భరించలేకపోతున్నానని చెప్పాడు. దీంతో వారు అతడి కోసం వెతకసాగారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా సాయిప్రియ లాడ్జిలో ఉన్నాడని తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. లాడ్జి తలుపులు తెరిచి చూసేసరికి చైతన్యరాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులకు అందేనా!



బిక్కవోలులో రుణాల ఇంటర్వ్యూకు హాజరైన దరఖాస్తుదారుడు (ఫైల్)

- సబ్సిడీ రుణాలపై గందరగోళం
- యూనిట్లు తక్కువ, దరఖాస్తులు ఎక్కువ
- తమ వారికే లబ్ధి చేకూర్చేందుకు కూటమి నాయకుల యత్నం

బిక్కవోలు: చేతిలో విద్యార్హతలు ఉన్నాయి. వ్యాపార అనుభవం ఉంది. చిన్నపాటి పరిశ్రమ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకోవచ్చునే ఆలోచన ఉంది. కావాల్సినదంతా పెట్టుబడి. ఈ దశలో ప్రభుత్వం బీసీలతో పాటు ఈడబ్ల్యూసీ, కాపులు ఆయా కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించింది. బ్యాంకులు పెట్టుబడికి అప్పులు ఇస్తాయి. ప్రభుత్వం కొంత సబ్సిడీ ఇస్తుంది. రుణం మంజూరైతే స్వగ్రామంలోని ఉపాధి కలుగుతుందనే ఆశతో చాలామంది దరఖాస్తు చేశారు. కానీ యూనిట్లు తక్కువ, దరఖాస్తులు ఎక్కువగా రావడంతో నిరాశ పడుతున్నారు. కొందరు దరఖాస్తుదారులు.. సిఫారసుల కోసం కూటమి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

ఆశలకు గండి

సబ్సిడీ రుణాల ఆశావహులకు మొదట్లోనే ప్రభుత్వం గండి కొట్టింది. మండలానికి చాలా తక్కువ యూనిట్లు మంజూరు చేసింది. కానీ వాటికి దరఖాస్తులు అధికంగా వచ్చాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. నియోజకవర్గంలో బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 376 యూనిట్లు మంజూరు కాగా, వాటికి 2,461 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో బీసీ యూనిట్లు 181కి 1,775 దరఖాస్తులు, కాపు యూనిట్లు 89కి 385 దరఖాస్తులు, ఈడబ్ల్యూఎస్ 53 యూనిట్లకు 301 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రాజకీయ జోక్యం

సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయింది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల పెత్తనం సాగింది. వారు ఎవరి పేరు చెబితే వారికే సబ్సిడీ రుణాలు ఇచ్చారు. ఇప్పుడు అదే విధంగా గ్రామాల్లో కూటమి వ్యవహారాలు చూస్తున్న నాయకులు అర్హుల జాబితాలను తయారు చేస్తున్నట్లు సమాచారం. ఈ జాబితాలను అధికారులకు ఎమ్మెల్యే పంపుతున్నారని తెలుస్తోంది. దీంతో దరఖాస్తుదారుల్లో నిరాశ అలముకుంది. అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదు. ఈ దశలో సబ్సిడీ రుణాలైనా అర్హులకు అందుతాయనే ఆశ పడగా, వాటిపై కూటమి నాయకుల పెత్తనం పెరగడంతో దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు. ఇదే అవకాశంగా కూటమి పార్టీల సానుభూతిపరులు, గతంలో సబ్సిడీ రుణాలు పొందిన వారు మున్ముందు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అన్ని అర్హతలున్న వారు ఆందోళన చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాం. వీరిలో అర్హులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బ్యాంకుల వారీగా సబ్సిడీ రుణాలు ఎవరికి ఎన్ని ఇవ్వాలో జిల్లా అధికారులు నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేస్తాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, బిక్కవోలు

నీకు భారం కాలేను..

పిల్లల్ని జాగ్రత్తగా చూసుకో..

- గోదావరిలో దూకిన వివాహిత
- భర్తకు మెసేజ్ పెట్టి ఆత్మహత్య

ఏలూరు టౌన్: అన్నింటికీ నీపై ఆధారపడుతున్నాను.. ఇక నీకు భారం కాలేను.. పిల్లల్ని జాగ్రత్తగా చూస్కోండి అంటూ భర్తకు ఫోన్‌లో మెసేజ్ పెట్టి ఓ వివాహిత గోదావరిలోకి దూకి తనువు చాలించింది. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరంలోని లాలా చెరువు స్పిన్నింగ్ మిల్లు ప్రాంతానికి చెందిన సుంకరం రామకృష్ణ, కల్యాణి (32) దంపతులు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. ఏలూరు శాంతినగర్ 21వ డివిజన్ సచివాలయంలో కల్యాణి ఏఎన్ఎంగా పనిచేస్తుండడంతో ఆమె కుటుంబంతో అక్కడే నివాసం ఉంటున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమెకు కాలికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె సరిగ్గా నడవలేని పరిస్థితిలో భర్తపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. ఆమె చేస్తున్న ఉద్యోగంలో, కుటుంబ జీవనంలోనూ భర్తపై ఆధారపడుతోంది. ఒకవైపు కరోనా వ్యాప్తి చెందుతుందనే భయం, మరోవైపు పనిభారం పెరగడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది. ఈ నేపథ్యంలో ఆమె బుధవారం ఎవరికీ చెప్పకుండా రాజమహేంద్రవరం వెళ్లింది. అక్కడి నుంచి భర్త రామకృష్ణకు ఫోన్‌లో.. ప్రతి పనికి నీ మీద ఆధార పడి ఉంటున్నా.. నిన్ను ఇబ్బంది పెడుతున్నాను.. నాకు జీవితంపై విరక్తి కలిగింది.. పిల్లల్ని జాగ్రత్తగా చూసుకో అని మెసేజ్ పెట్టింది. దీంతో ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా సెల్‌ఫోన్ సిగ్నల్ ట్రేస్ చేశారు. లొకేషన్ రాజమహేంద్రవరంలో చూపించగా అక్కడకు వెళ్లి వెదికారు. తీరా చూస్తే ఆమె గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రాజమహేంద్రవరం త్రీ టౌన్ సీఐ వీ అప్పారావు ఆధ్వర్యంలో మృతదేహాన్ని రాజమండ్రి సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మొక్కల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో గురువారం సుమారు వెయ్యి మామిడి, గులాబీ మొక్కలను పంపిణీ చేశారు. కొంకుదురుకు చెందిన సబ్బెళ్ల ఆనందరెడ్డి, జొన్నడకు చెందిన నల్లమిల్లి దుర్గారెడ్డి సంయుక్తంగా గ్రామానికి చెందిన ఉప సర్పంచి సత్తి తాతారెడ్డి జ్ఞాపకార్థంగా వీటిని అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ చేయాలని కోరారు.

మొక్కలు ఇలా.. సంరక్షణ ఎలా..



ట్రీ గార్డులు లేని మొక్కల వద్ద గడ్డిని మేస్తున్న గేదెలు



అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో కొన్ని మొక్కలకు ఏర్పాటు చేసిన ట్రీ గార్డులు



మొక్కలు నాటిన ప్రదేశంలోనే మేత మేస్తున్న ఆవు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన 16వ డివిజన్ వాంబేకాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద బీట్ ది హీట్ కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు తదితరులు సుమారు 40 మొక్కల వరకూ నాటారు. వాటిలో కొన్నింటికి ట్రీ గార్డులు కూడా ఏర్పాటు చేశారు. మిగిలిన మొక్కలను అలాగే వదిలివేశారు. అయితే అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రహరీ లేకపోవడంతో గేదెలు, ఆవులు పచ్చగడ్డి మేసేందుకు తరచూ వస్తున్నాయి. దీంతో నాటిన మొక్కల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది.

– ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)

సినిమాలు



శ్యామల	:	భైరవం
సూర్యమినీ	:	ఫైనల్ డెస్టినేషన్, మిషన్ ఇంపాజిబుల్
సూర్యప్యాలెస్	:	కరాటే కిడ్
స్వామి	:	ఖలేజా
శివజ్యోతి	:	హిట్-3
అనుశ్రీ	:	ఖలేజా
రాజా	:	ఖలేజా
ఊర్వశి	:	ఘటికాచలం
మేనక	:	శుభం
రంభ	:	షష్టి పూర్తి
అప్సర	:	సింగిల్
కుమారి	:	వర్గం
అశోక	:	భైరవం
నామవరం		
వీఎస్ మహల్	:	భైరవం
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	భైరవం
కడియం		
వెంకటసూర్య	:	భైరవం